

పట్టాలు లేక... పథకాలకు అందక

- భూ భారతితోనైనా విముక్తి కలిగేనా..?
- ధరణిలో తప్పిదాలతో రైతుల అవస్థలు
- సర్వేలు చేసినా సమస్య తీరని వైనం

7

పార్లమెంటు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ



ఎంపీని సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నానని, పార్లమెంట్ సమావేశాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని పెద్దపల్లి ఎంపీ గ డ్డం వంశీకృష్ణ తెలిపారు. శనివారం మందమర్రిలో ఆర్టీసి బస్టాండ్‌ను సంద ర్శించారు. కార్యకర్త ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న ప్రజల ఆశలు ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ముందు ఉన్న లక్ష్యమన్నారు. పార్లమెంట్ పరిధిలోని రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు కృషి చేస్తు న్నానన్నారు. ఇటీవల కరోన కాలంలో నిలిచిపోయిన బల్లార్షా కాజీపేట రైళ్లను పునఃప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీని యూత్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంద తిరుమల్ రెడ్డి, రాయబారం కిరణ్ పాల్గొన్నారు.

మహిళలకు ఘన సన్మానం



నస్పూర్‌లో సన్మానం పొందిన మహిళలు

నస్పూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో శనివారం నస్పూర్‌లోని మలారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆశ వర్కర్లకు, పారిశుధ్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ ఆధ్వర్యంలో మహిళలకు శాలువలు కప్పి సత్కరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మన్, మండల కార్యదర్శి మల్లయ్య, 19వ వార్డు మాజీ కౌన్సిలర్, రేగుంట చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి, మండల సహాయ కార్యద ర్శి మొగిలి లక్ష్మన్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బొల్లం పూర్ణిమ, పద్మ, పాల్గొన్నారు.

కుటుంబానికి ఆర్థిక సహాయం

జైపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పి. దుర్గారావు భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డికి శనివారం కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. మండల కాంగ్రెస్ నాయకులు కల్కి రమష్, అనిల్ పాల్గొన్నారు.

అత్యధిక క్రైం రేట్ నమోదు..



ప్రస్తుతం మంచిర్యాల పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఏడాదికి సగటున క్రైం రేటు వెయ్యి వరకు ఉంటుంది. వ్యాపార కేంద్రం విరాజిల్లుతున్న జిల్లా కేంద్రంగా ఏర్పాటైన నాటి నుంచి దినదినాభివృద్ధి సాధిస్తోంది. పట్టణ పరిసర ప్రాంతాల్లో విరివిగా నివాస గృహాలు వెలుస్తుండగా ప్రజల సంచారం అధికమైంది. లాడ్జీలు, హోటళ్లు, ఆసుపత్రులు వదుల సంఖ్యలో ఏర్పడగా నిత్యం వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చిపోయేవారి సంఖ్య కూడ అధికంగా ఉంటోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టే ట్ వ్యాపారం జోరుగా సాగుతుండగా, అదే స్థాయిలో వివాదాలు చోటు చేసుకుంటు న్నాయి. సాధారణంగా ఆరువందల వరకు క్రైం రేటు ఉంటే ఒక పోలీసు స్టేషన్ పరిధిలో పరిపాలన సుల భంగా ఉంటుంది. కాని మంచిర్యాలలో అంతకు రెట్టింపు ఉండడంతో సమస్య తీవ్రంగా ఉంది.

కొత్త ఠాణాల ఏర్పాటుకు మార్గం సుగమం

- సన్నాహాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే జిల్లా నుంచి పలు ప్రతిపాదనలు
- కొత్త స్టేషన్‌లతో పాటు అప్‌గ్రేడేషన్ కూడా
- మంచిర్యాలలో కొత్తగా 2-టౌన్ పీఎస్ ఏర్పాటు

మంచిర్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణను పటిష్టంగా అమలు చేసేందుకు పోలీసు శాఖ సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా కొత్త పోలీసుస్టేషన్ల ఏర్పాటుతోపాటు ఉన్న వాటికి అప్‌గ్రేడేషన్ చేయడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వంపై చర్యలకు శ్రీకారంచుడుతోంది. జిల్లాలో కొత్త పోలీసు స్టేషన్‌లు, అప్‌గ్రేడేషన్లకు సంబంధించి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు.

మంచిర్యాలలో 2-టౌన్ ఏర్పాటుకు చర్యలు...

జిల్లా కేంద్రంలో 2-టౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దాల కాలంగా ఉంది. టౌన్ పెద్దది కావడం, క్రైం రేట్ కూడా ఎక్కువ ఉండడంతో ఇక్కడ కొంత మేరలా అండ్ ఆర్డర్ సమస్య తరచుగా తలెత్తుతోంది. మంచిర్యాల పట్టణం టౌన్-1, టౌన్-2గా ప్రజలు పిలుస్తుంటారు. టౌన్-1తో సమానంగా టౌన్-2 కూడ శర వేగంగా అభివృద్ధి చెందుతోంది. అభివృద్ధితో పాటు క్రైం రేట్ కూడా పెరుగుతుండడంతో టౌన్-2గా పిలువబడే హమాలీవాడ ప్రాంతం కేంద్రంగా ప్రత్యేకంగా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 2024 ఆగస్టులో పోలీసుశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. మంచిర్యాల పట్టణంలో ప్రస్తుతం 2లక్షలపై చిలుకు జనాభా ఉంది. టౌన్-1, టౌన్-2లో దాదాపుగా సమానంగా లక్ష చొప్పున జనాభ ఉంటుంది.

మొత్తంగా రెండులక్షల జనాభాకు సంబంధించి ప్రస్తుతం ఒకే ఒక్క పోలీసు స్టేషన్ ఉండడంతో సమస్యల పరిష్కారానికి సకాలంలో చర్యలు చేపట్టలేక పోతున్నారు. హమాలీవాడ కేంద్రంగా మరో పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తే పరిపాలన సులభతరం అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విషయమై పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడ హామీలు ఇచ్చినప్పటికీ ఏళ్లు గడిచినా నెరవేరడం లేదు. టూటౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు విషయమై స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు మార్గం సుగమం అయింది.

2-టౌన్ ఏర్పాటుతో ప్రజా సమస్యలకు పరిష్కారం...

హమాలీవాడ కేంద్రంగా 2-టౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడగానే కార్యాచరణ ప్రారంభించేందుకు పోలీసుశాఖ ఏర్పాట్లు చేస్తోంది. హమాలీవాడలో..

(తరువాయి 7లో)

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా..?

సాగునీటి కోసం రోడ్డెక్కి అన్నదాతల రాస్తారోకో



దండేపల్లి మండలంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

దండేపల్లి, మార్చి8 (ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా అంటూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగిలో కడెం ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేసిన తమ వరిపొలాలకు సాగునీరు అందక పంటలు ఎండు తున్నాయని, నీటి పారుదల శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో దండేపల్లి మండలంలో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దండేపల్లి మండలం మాకులపేట, మోకాసిగూడ, నాగసముద్రం, తాళ్లపేట గ్రా మాలకు చెందిన రైతులు శనివారం నాగసముద్రం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై బైఠాయించారు. కడెం ఆయకట్టు కింద 24వ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా పంటలకు సాగునీరు అందక తాము సాగు చేసిన పొలాలు ఎండిపో తున్నాయని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వారబందీ పద్ధతిలో సాగునీరు అందిస్తున్నా మని ప్రకస్తున్న అధికారులు సక్రమంగా నీరు ఇవ్వడం లేదంటున్నారు. రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న దండేపల్లి ఎస్సై తైసినొద్దీన్ అక్కడకు చెరుకు ని రైతులతో మాట్లాడి ఆందోళన విరమించాలని సూచించినా వినకపోవడంతో ఎస్సై నీటి పారుదల శాఖ అధికారులకు ఫోన్ ద్వారా రైతుల సమస్యను వివరిం చారు. వారబందీ ప్రకారం సాగు నీటిని సక్రమంగా అందించేలా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

లక్షెట్టిపేట, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేట గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి శనివారం క్షీరాభిషేకం చేసారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించడాన్ని సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. నాయకులు చిప్పకుర్తి నారాయణ, సినీంద్రి, సతీష్, మనోహర్, శ్రీకాంత్, గంగయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

కోటపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పారుపెల్లి గ్రామంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం ప్రధాన అర్చకులు ఏలేశ్వరం రమేష్‌చారి, పారుపెల్లి భక్త బృందం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు సుప్రభాత సేవ, గణపతి పూజతో ఈ కార్యక్రమాలు ప్రారంభవుతామని ఉదయం 10 గంటల నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఎక్యాహం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సోమవారం సహస్ర నామార్చన, మహా ప్రసాద నివేదన లాంటి కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయం

మందమర్రిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఆస్తుల రక్షణతో పాటు శాంతి భద్రతల పరిరక్షణ కోసం మహిళ పోలీసులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ కానిస్టేబుళ్లు, హోంగార్డులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. సీఐ మాట్లాడుతూ ఎంతో మంది మహిళలు ఉన్నత చదువులు చదివి పోలీసు శాఖలో ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. భవిష్యత్‌లో మహిళ కానిస్టేబుళ్లు మంచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని నారాయణ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కళావతి మాట్లాడుతూ మహిళలందరు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిమందులు పంపిణీ చేశారు. డాక్టర్ మోహన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకమైనది

కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబాన్ని తీర్చిదిద్దడం నుంచి దేశాన్ని పాలించే వరకు మహిళల పాత్ర కీలక మైనదని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్‌లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు సామాజికంగా ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని, దేశ ప్రథమ పౌరురాలి స్థానంతో పాటు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐఎఎస్, ఐపీఎస్, ఆర్మీ, నేవి, ఎయిర్ ఫోర్స్ , శాస్త్రవేత్తలుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలు సాధిస్తున్న విజయాలకు గుర్తింపునిచ్చి వారిని మరింత ప్రోత్సహించాలన్నారు. మహిళలకు ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన మహిళ అధికారులు, ఉద్యోగులను ప్రశంసా పత్రాలు, శాలువాలతో సత్కరించారు ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు అందర్ని అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల పాత్ర కీలకం

మంచిర్యాల డీసీపీ భాస్కర్



మహిళ సిబ్బందితో కేక్‌కట్ చేస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

మంచిర్యాల క్రైం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో మహిళా పోలీసు పాత్ర కీలకమని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీసీపీ మహిళ అధికారులను, కానిస్టేబుళ్లను సన్మానించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖలో మహిళ పోలీసు పాత్ర కీలకమని, మంచిర్యాల జోన్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో అన్ని రంగాల్లో పురుషులకంటే మహిళలే మెరుగ్గా రాణిస్తున్నార న్నారు. పురుషుకంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాశ్, సీఐ ప్రమోద్‌రావు, మహిళ పోలీసు స్టేషన్ సీఐ నరేశ్, తాండూర్ కుమారస్వామి, మహిళ ఎస్ఐ హైమ, పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా మహిళ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంచిర్యాల మండల విద్యాధికారి వీఎస్‌వీ మాలవిక దేవి హాజరయ్యారు. 18 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవ అధ్యక్షులు కరుణాకర్, ఉపాధ్యక్షులు పద్మ మహాలక్ష్మి, సంధ్య, సుమన్, మన్‌మోహన్‌సింగ్ ఉన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్



రాజీ పడ్డ కేసును పరిష్కరిస్తున్న జడ్జ్ అసదుల్లా షరీఫ్

లక్షెట్టిపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. పట్టణ న్యాయ స్థానంలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ సమయం చాలా విలువైనదని గడిచిన సమయాన్ని తిరిగి తెచ్చుకోలేమన్న విషయం ప్రతీ ఒక్కరూ గుర్తు పెటుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని న్యాయస్థానం పరిధిలో రాజీ పడిన పలు కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ నరేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్, లక్షెట్టిపేట, జన్నారం, దండేపల్లి, హాజీపూర్ ఎస్సైలు సతీష్, రాజవర్ధన్, తహసీయోద్దీన్, సురేష్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, భూంరెడ్డి, కారుకూరి సురేందర్, గాండ్ల సత్యనారాయ ణ, పద్మ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు : రాజీ మార్గమే రాజమార్గమని చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. శని వారం పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లా డారు. లోక్ అదాలత్‌లో మొత్తం 329 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు 159 కాగా వారికి విధించిన జరిమానా ద్వారా రూ. 4,90,700 వ చ్చిందన్నారు. అలాగే 41 బ్యాంకు కేసులు పరిష్కారం కాగా రూ. 28,80,814 వచ్చిం దన్నారు. 28 క్రిమినల్ కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్ అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

దళితులపై దాడులను నియంత్రించాలి

నస్పూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా దళతులపై జరుగుతున్న దాడులను నియంత్రించాలని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు ఎక్కువైయ్యాయని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అన్నారు. నస్పూర్ పట్టణం సీసీస కార్నర్ వద్ద శనివారం డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సమావేశాలు ఈ నెల 10,11, 12 తేదిల్లో వేములవాడలో జరుగుతున్న సందర్భంగా వాటిని విజయవంతం చేయాలని ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ కర పత్రాలను పంపిణీ చేశారు.

నిందితుడిపై కేసు నమోదు చేయాలి

తాండూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్‌లో దళిత మహిళ అయిన ఆశావర్కర్‌పై అత్యాచారం చేసిన నిందితుడిని అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని సీఐటీ యూ జిల్లా సహాయక కార్యదర్శి రాజారాం శనివారం డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

ఆదివాసీలను నట్టేట ముంచుతున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కోట శ్రీనివాస్

వేమనపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను పట్టించుకోకుండా నట్టేట ముంచుతున్నాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కోట శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బొమ్మెన గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 40 శాతానికి పైగా ఆదివాసీ గ్రామాలన్నింటినీ ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గూడాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పోడు పట్టాలు ఉన్న భూములకు బ్యాంకు రుణాలు అందించాలన్నారు. ఎఫ్ఆర్‌సీ కమిటీలు ఉన్న గ్రామాల్లో సర్వే చేసి అర్హులైన గిరిజను లకు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అటవీ ఉత్పత్తులపైన ఆదివాసీలకు ఎలాంటి హక్కులు లేకుండా చట్టాలను నీరుగారుస్తూ అటవీ సంరక్షణ చట్టం పేరుతో లక్షలాది ఎకరాల అడ విని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. తునికాకు సేక రణకు ఇప్పటి వరకు టెండర్లు పిలవకపోవడం శోచనీయమన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు వేయడానికి అటవీ అనుమతులు ఇవ్వకపోవడంతో ఆదివాసీలు కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఆదివాసీలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, వారికి ప్రత్యేక హక్కులను కల్పించాలని, ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నం, నాయకులు రమేష్, శంకర్, మల్లేశ్వరి, పార్వతి, మదునయ్య, పుల్లయ్య, విజయ, మొండి, సాయి, తిరుపతి, పోశన్న, ఆదివాసీలు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

తాండూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ పత్తివిత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఐజీ, మంచిర్యాల జిల్లా డీసీపీ ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమార స్వామి ఆదేశాలతో తాండూర్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం రేచని, గోపాల్‌నగరం గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో, గతంలో నకిలీ విత్తనాల కేసులో పట్టుబడ్డ వ్యక్తుల ఇళ్లల్లో సైతం తనిఖీ చేశారు. ఎక్కడైన నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు, నిల్వ ఉన్నట్లు సమాచారం తెలిస్తే సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తాండూర్ 87126 56575 నంబర్‌లో ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు. తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

భీమిని, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లో శనివారం అనుమానాస్పద వ్యక్తుల ఇండ్లలో, గతంలో నకిలీ పత్తినాలు అమ్మిన ఇండ్లలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత నకిలీ విత్తనాలు అమ్మడం చట్టరీత్యా నేరమని, నకిలీ పత్తి విత్తనాలు ఇళ్లలో నిల్వ చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మూడు ఇళ్లు దగ్ధం

● ప్రమాదంలో ఎద్దు మృతి



ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడద స్నాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని మూడు ఇళ్లు కాలిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,, దరావత్ బలరాం, దరావత్ నాందేవ్, దరావత్ జమిందాస్ నివాసాలపై నుంచి విద్యుత్ వైర్లు ఉన్నారు. శుక్రవారం రాత్రి సమయంలో గాలికి ఒకదానికొకటి తగిలి మంటలు లేచాయి. నిప్పు రవ్వలు ఇంటి సమీపంలో గడ్డి వాముపై పడడంతో మంటలు చెలరేగి ఇళ్లకు అంటుకున్నాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వాహనం వచ్చే లోపు ముగ్గురి ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. పక్కనే ఉన్న పశువుల పాకకు సైతం నిప్పంటుకోవడంతో ఒక ఎద్దు మృతి చెందింది. మరో రెండు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇళ్లల్లో ఉన్న నిత్యావసర వస్తువులు, సామగ్రి కాలిపోయింది. సుమారు ఆరు లక్షల రూపాయల ఆస్తి నష్టం కలిగిందని బాధిత కుటుంబీకులు తెలిపారు. శనివారం ఉదయం సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ బాధిత కుటుంబాలను పరామర్శించి నగదు సాయం అందజేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మితో మాట్లాడి బాధితులకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలి

దండేపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ దొంగిలించినా, ఎక్కడైనా పోగొట్టుకున్నా, వాటిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్ తెలిపారు. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన గడికొప్పుల తిరుపతి అనే యువరైతు ఇటీవల వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో తిరుపతి దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ఫోన్‌ను రికవరి చేసి తిరుపతికి శనివారం ఎస్సై అందజేశారు.

అద్దెకు వ్యవసాయ పరికరాలు

● మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహణ ● ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



మండల సమాఖ్యలో అందుబాటులో ఉన్న అద్దె పరికరాలు

తిర్యాణి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయం చేసేందుకు ఆసక్తి ఉన్నా కూలీల కొరత వేధిస్తోంది. ఆధునిక యంత్రాలను కొనుగోలు చేయాలంటే అంత ధరలు భరించలేరు. ప్రభుత్వం రాయితీలను సైతం నిలిపివేయడంతో సామాన్య రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఐకేపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలను అద్దె ప్రతిపాదికన అందజేస్తున్నారు. తక్కువ ధరలకే రైతులకు రోజు వారీ అద్దె రూపంలో యంత్రాలను అందిస్తున్నారు. దీంతో అటు మండల సమాఖ్య ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు ప్రయోజనంగా ఉందని చెబుతున్నారు.

రైతులతో ఒప్పందం..

మండల సమాఖ్య సభ్యులు రైతులకు యంత్రాలను ఇచ్చే సమయంలో వారి నుంచి ఒప్పందం చేసుకుం టారు. ఈ ఒప్పందం ప్రకారం ఎన్ని రోజులు అవసరం పడుతుందో దాని అద్దెలో ముందుగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. అద్దెకు తీసుకున్న సమయం లో యంత్రాల పరికరాలు చెడి పోవడం, మరమ్మతు లకు గురైతే వాటి భారాన్ని రైతులే భరించాలి. రైతులు యంత్రాలను అద్దెకు తీసుకునే క్రమంలో పట్టాదారు పుస్తకం, ఆధార్ జిరాక్స్ అందజేయాల్సి ఉంటుంది.

అందుబాటులో 11 రకాలు..

జంగుబాయి సమాఖ్య కార్యాలయంలో అద్దెకు లభించే మొత్తం 11 రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని రోజు లెక్కన అద్దెకు ఇస్తుంటారు. ట్రాక్టర్ అద్దె రోజుకు 1,400, ట్రాలీకి 600, ప్లావ్‌కు 500, కల్టివేటర్ 500 రూపాయలు చెల్లించాలి. కాటన్ షెడ్డర్ రోటవేటర్ 1000, సీడ్‌కం ఫర్టిలైజర్ డ్రిల్లర్ 1000, పవర్ వీడర్ 500, బూమ్ స్ప్రేయర్ 1000, తైవాన్ స్ప్రేయర్‌కు 200, బ్యాటరీ స్ప్రేయర్‌కు 100 రూపాయలు రోజు వారీ అద్దె నిర్ణయించారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు మరింత తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా యంత్రాలను మండలంలోని రైతులతో పాటు ఇతర మండలాలకు చెందిన రైతులు కూడా అద్దెకు తీసుకునే వెసులుబాటు ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి..

శ్రీనివాస్, ఏపీఎం, తిర్యాణి

రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మండల సమా ఖ్య కార్యాలయంలో అతి తక్కువ ధరకు 11 రకాల యంత్రాలను అద్దెకు ఇస్తున్నాం. ఇందులో రైతులతో ముందుగానే ఒప్పందం చేసుకుంటున్నాం. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే మండల సమాఖ్యలో అతి తక్కువ ధరకే యంత్రాలను ఇస్తుండడంతో రైతుల నుంచి మం చి స్పందన వస్తోంది. మహిళా సంఘాల్లోని సభ్యులకు అద్దెను మరింత తగ్గిస్తున్నాం.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



రాజ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

వైద్యుడు: పీహెచ్‌సీ పరిధిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పీహెచ్‌సీ పరిధిలో ఐదు సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఇందులో రెండు పల్లె దవాఖానాలు ఉన్నాయి. గ్రామంలో ప్రజలకు అవసరమైన మేర ఇక్కడ సిబ్బంది వైద్యం అందిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీలో సరిపడా సిబ్బంది ఉన్నారా?

వైద్యుడు: ఇక్కడ విధులు నిర్వహించే స్టాఫ్ నర్సు ఇతర ప్రాంతానికి వెళ్లారు. దీంతో చింతలమానేపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంను డిప్యూటేషన్‌పై పంపించారు. ఇక్కడకు వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: వేసవిలో ప్రజలు ఎండ బారిన పడకుండా ఏం చర్యలు తీసుకోవాలి?

వైద్యుడు: రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నది. ప్రజ లు జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు రు మాలు, టోపీ ధరించి వెళ్లాలి. వడదెబ్బకు గురైతే వైద్యులను సంప్రదించాలి.

- చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి)

పోచమ్మ ఆలయంలో హోమం

బెజ్జూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో శనివారం హోమం నిర్వహించారు. ఆదివారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉండడంతో ముందుగా ఆలయంలో భక్తులు గణపతి పూజ, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాజాభజంత్రీలతో దేవత విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీవర్ధన్, మనోహర్‌గౌడ్, చంద్రశేఖర్, నాగభూషణం గౌడ్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ముగిసిన కబడ్డీ పోటీలు



బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ మోతిరాం

కెరమెరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జాతర ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. మొదటి స్థానంలో సుల్తాన్‌గూడ టీఎంకే జట్టు నిలిచింది. విజేత జట్టుకు రూ.21 వేల నగదును మాజీ ఎంపీపీ మోతిరాం, మాజీ సర్పంచ్ జగన్నాథ్‌రావు, కాంగ్రెస్ నాయకుడు రాము అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ఆడెసర ఆదివాసీ జట్టుకు రూ.15 వేల నగదును ఆత్రం సక్కు యూత్ ఫోర్స్ అధ్యక్షుడు భీంరావు అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన బోరిలాల్ గూడ జట్టుకు రూ.10 వేల నగదును బీజేపీ మండలాధ్యక్షుడు తుకారాం, మాజీ డైరెక్టర్ ఆనంద్‌రావు అందజేశారు.

ఎల్ఆర్ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భూములను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దరఖాస్తుదారులు, సబ్ రిజిస్టర్ రైటర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకుని రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పించిందనా న్నారు. 25 శాతం తగ్గింపును దరఖాస్తుదారులు వినియోగించుకోవా లన్నారు. ఈ నెల 31 లోపు అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలోని రెండు మున్సిపాలిటీ పరిధిలో 3,529 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఇందులో 3,102 దరఖాస్తులను గుర్తిం చి ఎల్ఆర్ఎస్ చెల్లించేందుకు పంపించామని తెలిపారు. 335 గ్రామ పంచాయతీల్లో 4,170 దరఖాస్తులు రాగా 1,665 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 32 మంది చెల్లించాలని వివరించారు. సులభతరమైన సేవలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, మున్సిపల్ అధికారుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ ఇప్పుడు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లిస్తే సంబంధిత అధికారులు పరిశీలిస్తారన్నారు. ఇంటి నిర్మాణంలో ఇబ్బందులు లేకుండా ఉండాలంటే తప్ప ని సరిగా ఎల్ఆర్ఎస్ కట్టాల్సి ఉంటుందని సూచించారు. బ్యాంకు రుణం సౌకర్యం కూడా పొందవచ్చని తెలిపారు. సమావేశంలో డీపీవో భిక్షపతిగౌడ్, మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం



కేసులను పరిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్

ఆసిఫాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం లభించనుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్ అన్నారు. శనివారం కోర్టు అవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీమార్గమే రాజమార్గం అన్నారు. లోక్ అదాలత్‌లో ఇరు పక్షాలు రాజీపడ్డ కేసులను పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజు, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవిందర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

సిర్పూర్(టి), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజమార్గమని సిర్పూర్(టి) న్యాయమూర్తి అజయ్ అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 498 కేసులను రాజీమార్గంలో పరిష్కరించారు. దీనికి సంబంధించిన రూ.13,42,050 జరిమానా విధించారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, కళ్యాణ్, సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

కాగజ్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చారిగాం గ్రామానికి చెందిన షేక్ చందు(62) అనే వ్యక్తి ఈ నెల 4వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. షేక్ చందు భార్య మున్నమి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

ఎస్టీపీపీకి మరో జాతీయ అవార్డు

జైపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో విశేష మైన సేవలందిస్తున్నందుకు గుర్తింపుగా సింగరేణికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక ఎఫిసియెంట్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫ్లైయాస్ అవార్డు దక్కినట్లు ఎస్టీపీపీ ఇన్‌చార్జీ ఈడీ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవాలో మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ఎస్టీపీపీ తరుపున అధికారి ప్రభాకర్‌రావు కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ చేపడుతున్న పర్యావరణ హిత సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. సింగరేణి థర్మల్ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే బాటమ్ యాష్ , ఫ్లైయాష్‌లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నారని పేర్కొన్నారు. అవార్డు రావడంతో సీఎండీ బలరాం, డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు ఉద్యోగులను అభినందించారు.

100 శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో 100 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించామని గని మేనేజర్ తిరుపతి తెలిపారు. గని ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ గని ఉత్పత్తి లక్ష్యం లక్ష 80 వేల మెట్రిక్ టన్నులని చెప్పారు. 20 రోజుల ముందుగానే ఆ మేరకు బొగ్గు ఉత్పత్తి చేశామన్నారు. గత ఐదేళ్లలో 100 శాతానికి పైగా ఉత్పత్తి సాధిస్తున్నామని చెప్పారు. సమావేశంలో గని రక్షణాధికారి శ్రీనివాస్, పిట్ ఇంజనీర్ శ్యాం కుమార్, సర్వే ఆఫీసర్ ఎస్‌పి వర్మ, సంక్షేమాధికారి సురేందర్, పిట్ కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనతోనే మహిళలకు గుర్తింపు



ఆర్‌కే 7 గనిలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

శ్రీరాంపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్వావలంబనతోనే మహిళలకు గుర్తింపు లభిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో సేవా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవోలు కాంతారావు, రణదీప్‌గౌడ్, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. ఆర్‌కే 7 గనిలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా జీఎం శ్రీనివాస్ హాజరై మహిళా ఉద్యోగులతో కేక్ కట్ చేయించారు. బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌కే 7 గ్రూపు ఏజెంట్ రాజేందర్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి సంతోష్ రావు, పిట్ కార్యదర్శి మారేపల్లి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రగతికి పాటుపడాలి

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ప్రగతికి మహిళలు పాటుపడాలని జీఎం దేవేందర్ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో దాదాపు 2,500మంది మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారని అన్నారు. భవిష్యత్‌లో వారే కీలకం కానున్నారని ఆయన తెలిపారు. అనంతరం సేవా సమితి అధ్యక్షురాలు స్వరూప రాణి దేవేందర్ మాట్లాడుతూ యాజమాన్యం చేయూతతో సేవా సమితి మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. మహిళలు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



మహిళలను సన్మానిస్తున్న జీఎం దేవేందర్, సేవా సమితి అధ్యక్షురాలు స్వరూప దేవేందర్



హామీలను నెరవేర్చిన ఘనత ఏఐటీయూసీదే



మాట్లాడుతున్న సలేంద్ర సత్యనారాయణ

మందమర్రిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2023లో జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత తమ యూనియన్‌దేనని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ , ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్‌లు తెలిపారు. శనివారం స్థానిక ఏరియా వర్కుషాపులో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కార్మికుల హక్కులను నెరవేర్చడంలో తమ యూనియన్ ముందుంటుందన్నారు. భవిష్యత్‌లోమరిన్ని డిమాండ్లు సాధిస్తామ న్నారు. కార్యక్రమంలో వర్కుషైన్ ఇన్‌స్పెక్టర్ ముల్కలపల్లి వెంకటేశ్వర్, ట్రేడ్‌మెన్ ఇన్‌చార్జీ తిరుపతి, నాయకులు అంతోని దినేష్, బానయ్య, రాజేశం, రాజేశ్వర్‌రావు, శర్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల సంబరాలు

కాసిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సీఎండీ స్థాయిలో శుక్రవారం నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశంలో కార్మికుల డిమాండ్లను యాజమాన్యం ఒప్పుకున్నందుకు శనివారం కాసిపేట గనిపై ఏఐటీయూసీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను, ఏఐటీయూసీ ఇచ్చిన హామీలను సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గని పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, నాయకులు లింగయ్య, అనిల్, రంజిత్, అశోక్, రఘురామ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజన్న, రవీందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి అచ్చుత్ , కాసిపేట



ఆంధ్రజ్యోతి : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు సుకుంటున్నారు?

ఏఈ : మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలతో పాటు తాగు నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించాం. అక్కడ తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి తాగునీటిని అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మిషన్ భగీరథ నీరు గ్రామాల్లోకి రావడం లేదు, ఎందుకు?

ఏఈ : మిషన్ భగీరథ అంతర్గత పైపులైన్‌లు కొన్ని చోట్ల పగిలిపో వడంతో నీరు కొన్ని గ్రామాల్లోకి రావడం లేదు. ఎప్పటికప్పుడు పైపులైన్లను మరమ్మతులు చేసి మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని చేతి పంపులు పనిచేస్తున్నాయి, వాటి నిర్వహణ ఎలా ఉంది?

ఏఈ : కాసిపేట మండలంలో 357 చేతి పంపులు, 70 రక్షిత మంచినీటి ట్యాంకులు పనిచేస్తున్నాయి. చెడిపోయిన చేతి పంపులను గుర్తించి మరమ్మతులు చేయించి నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఓవర్ హెడ్ ట్యాంకులను నెలకు మూడు సార్లు శుభ్రం చేసి సురక్షిత నీటిని సరఫరా చేస్తున్నాం.

-కాసిపేట, (ఆంధ్రజ్యోతి)

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బెల్లంపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని బజార్ ఏరియాలో గల ఫుట్‌పాత్‌పై ఉన్న తాత్కాలిక దుకాణాలను మున్సిపల్ సిబ్బంది శనివారం తొలగించారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వచ్చిన వినతుల మేరకు మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి చంద్ర శేఖర్ ఆద్వర్యంలో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. కాంటా చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ఆక్రమణలను తొలగించారు. తాత్కాలిక తోపుడు బండ్లను మార్కింగ్ చేసిన పరిధి అవతలికి తరలించారు. వన్ టౌన్ పోలీసుల బందోబస్తుతో ఆక్రమణలను తొలగించారు.

పట్టాలు లేక.. పథకాలు అందక



భూ సర్వేను పరిశీలిస్తున్న బెల్లంపల్లి ఆర్డీఓ శ్యామలాదేవి (ఫైల్)

భూ భారతిలోనైనా విముక్తి కలిగేనా..?

ధరణిలో తప్పిదాలతో రైతుల అవస్థలు

సర్వేలు చేసినా సమస్య తీరని వైనం

భీమిని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భూ ప్రక్షాలన, ధరణి రాకతో ఆ గ్రామం రైతులు భూ సమస్యల్లో కూరుకుపోయారు. పట్టాదారు పాసుపుస్తకాలు లేక బ్యాంకు రుణాలకు నోచుకోక, అప్పటి ప్రభుత్వంలో రైతుబంధు ప్రస్తుతం రైతుభరోసాలు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టబోయే భూ భారతి లోనైనా తంగళ్లపల్లి గ్రామ రైతుల సమస్య పరిష్కారం లభిస్తుందని వారంతా ఆశిస్తున్నారు. ఏళ్లుగా సాగు చేస్తున్న పట్టా భూ ములకు పాస్‌పుస్తకాలు ఇవ్వక పోవడంతో ఆ రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. భూ సమస్య పరిష్కరించాలని అధికారుల చుట్టూ... నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. భీమిని మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో ఇందూరు వంశంలో మూడు తరాలు కావస్తున్నా ఇప్పటికీ వీరి భూ సమస్య పరిష్కారం కావడం లేదు. సర్వే నంబరు 1 నుంచి 59 వరకు 300 ఎకరాల పెద్ద పట్టా, 300 ఎకరాల లావణి పట్టా భూమి ఉంది. గత ప్రభుత్వం కొత్త పాసు పుస్త కాలు జారీ చేయక ముందు వీరికి పట్టాలు ఉండేవి. భూములకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేక పోవడంతో రెవెన్యూ అధికారులు ఆ 600 ఎకరాల భూములను డిస్ప్యూట్‌లో పెట్టారు.

మండలం మార్పుతో...

రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం పునర్విభజనలో భాగంగా 2016లో తంగళ్లపల్లి గ్రామం కుమురం భీం జిల్లా దహగాం మండలం నుంచి భీమిని మండలంలో కలిపారు. కానీ తంగళ్లపల్లి గ్రామ రెవెన్యూ రికార్డులు భీమిని తహసీల్దార్ కార్యాలయానికి ఇవ్వలేదు. 1983లో దహగాం మండల తహసీల్దార్ కార్యాలయానికి మావోయిస్టులు నిప్పు పెట్టడంతో రెవెన్యూ రికార్డులు దగ్ధం అయ్యాయి. దీంతో దహగాం మండలం నుంచి భీమిని మండలానికి గ్రామ రెవెన్యూ రికార్డులు అందక పోవడంతో భూ సమస్యకు ప్రధాన కారణంగా మారింది. గతంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలతో తాము నష్టపోతున్నామని గ్రామ రైతులు ఆరోపిం చారు. ఒకరికి సంబంధించిన భూమిని మరొకరి పేరు మీదకి రికార్డుల్లో మార్చారని ఆరోపించారు.

అధికారులు సర్వేలు చేసినా...

రెవెన్యూ అధికారులు 2022లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో గ్రామంలో రీ సర్వే చేశారు. సర్వే చేసి మూడేళ్లు గడుస్తున్నా ఇంత వరకు భూ హక్కు పత్రాలు రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో రైతులకు పట్టా పాసు పుస్తకాలు లేకపోవడంతో బ్యాంకు అధికారులు పంటరుణాలను ఇవ్వడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద రుణాలు తీసుకొని అప్పుల్లో కూరుకుపోతున్నారు.

పండిన పంటలు అమ్మడానికి ఇబ్బందులు...

ఆన్‌లైన్‌లో భూములు వివరాలు నమొదు లేక పోవడంతో ఆ గ్రామ రైతులు తాము పండించిన ధాన్యాలను మార్కెట్లో అమ్మడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దీంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు అప్పట్లో ఇక్కడి రైతులు దహగాం బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు రెన్యూవల్ చేసుకోలేక పట్టాదారు పాస్ పుస్తకం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో 9 ఏళ్లుగా బ్యాంకు వడ్డీలు పెరిగిపోయాయి. దీంతో బ్యాంకు అధికారులు నోటీసులిచ్చి భూములు జప్తు చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని వాపోతున్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం...

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో రైతులు ప్రభుత్వ పథకాలు రైతుబంధు, రైతు బీమా, క్రాప్‌లోన్ వంటి బెనిఫిట్స్ పొందలేక పోతున్నారు.

ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామ రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఎన్ని సార్లు అప్లికేషన్లు ఇచ్చినా మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పెండింగ్‌లో ఎన్న ధరణి సమస్యలు పరిష్కారం చేస్తామన్న ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తంగళ్లపల్లి రైతులు ఆశలు పెట్టుకున్నారు.

రైతులకు న్యాయం చేయాలి..

ఇందూరి భూమేష్, మాజీ సర్పంచు, చిన్నతిమ్మాపూర్.

తాతల కాలం నుంచి సాగులో ఉన్నాము అధికారుల చుట్టూ తిరిగినా పట్టాలు రావడం లేదు. మూడు తరాలు మారినా పట్టాలు రావడం లేదు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని రైతులకు పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.



మా భూమి పట్టా మాకు ఇవ్వరా...

ఇందూరి శ్రీనివాస్, తంగళ్లపల్లి, రైతు

మా భూమి పట్టాలు మాకు ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటో తెలియడం లేదు. ధరణితో నష్ట పోయాము ఇప్పుడు భూభారతి అంటు న్నారు. ఇందులోనైనా మా భూముల పట్టాలు మాకు వస్తాయో తెలియడం లేదు. భూములకు పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సంక్షమ పథకాలు అందడంలేదు. అధికారులు, నాయకులు స్పందించి కొత్త పాసు పుస్తకాలు అందించాలి.



సమస్య పరిష్కారం ఎప్పుడో...

ఇందూరి గుండయ్య, రైతు, తంగళ్లపల్లి

తొమ్మిది ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాము. మా భూసమస్యలు మాత్రం పరిష్కా రం అవ్వడం లేదు. బ్యాంకు రుణాలు, రైతు భరోసా, రుణమాఫీలు, రుణాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. గ్రామంలో మా భూమిలో సాగు చేస్తున్నాం కానీ మాకు పట్టాలు లేవు. రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసినప్పటికీ నేటికీ పట్టాలు రాలేదు. మాకు ప్రభుత్వం త్వరిత గతిన న్యాయం చేసి పట్టాలు ఇప్పించాలి.



కొత్త ఠాణాల ఏర్పాటుకు మార్గం సుగమం..

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేకంగా సీఐ స్థాయిలో పోలీసు స్టేషన్ ఏర్పాటు కానుండగా ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తదితర సిబ్బంది మొత్తంగా 55 మంది వరకు ఉండనున్నారు. మంచిర్యాల డివిజన్‌లో డిగ్రేడ్‌తో కూడిన టౌన్-1తో సమానంగా టౌన్-2 పోలీసు స్టేషన్ ఏర్పాటు కానుంది.

నస్పూర్ పీఎస్ అప్‌గ్రేడేషన్ కూడా...

నస్పూర్ పోలీసు స్టేషన్ కూడా ఉన్నతీకరిం చేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రస్తుతం నస్పూర్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు నిర్వ ర్తిస్తుండగా అది ఈ-గ్రేడ్‌లో ఉంది. ఆ పోలీసు స్టేషన్‌ను సీఐ స్థాయిలో ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ చేస్తూ డి-గ్రేడ్‌కు మార్చనున్నారు. అక్కడ పీఎస్‌లో సీఐతో కలిపి 55 మంది సిబ్బంది విధులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నారు. నస్పూర్ పరిధిలో కలెక్టరేట్‌తో పాటు జనాభ కూడ అధికంగా ఉండడంతో క్రైం రేట్ కూడ ఎక్కువ మొత్తంలోనే నమోదు అవుతోంది. దీంతోపోలీసుస్టేషన్ అప్‌గ్రేడ్ చేయాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు.

ప్రతిపాదనలు పంపించాం...

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



మంచిర్యాల జిల్లా కేంద్రంలో 2-టౌన్ పోలీసు స్టేషన్‌తో పాటు నస్పూర్ పీఎస్ అప్‌గ్రేడేషన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. పెరుగుతున్న క్రైం రేట్‌కు అనుగుణంగా ప్రత్యేక పోలీసు స్టేషన్‌ఏర్పాటు చేయాలని నిర్ణయించాము. ప్రస్తుతం ఉన్న మంచిర్యాల టౌన్-1 పోలీసుస్టేషన్‌కు అదనంగా హమాలివాడలో టౌన్- 2, నస్పూర్‌లో అప్‌గ్రేడేషన్ చేయడం వల్ల ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ సులభతరం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

బాల సదనం శంకుస్థాపనలో ఎమ్మెల్యే



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, పక్కన కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్

నస్పూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బాల సదనం నూతన భవన నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అధికారులను ఆదేశించారు. మిషన్ వాత్సల్య నిధులు రూ. 1.34 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బాల సదనం భవన నిర్మాణానికి కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఏ. భాస్కర్, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్‌లతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టిని సారించామని, తొందరగా నిర్మాణ పనులు పూర్తి చేయాల న్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో బాలల సంరక్షణ దిశగా ప్రత్యేక శ్రద్ధతో అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఈఈ రాంమోహన్ రావు, డిప్యూటి ఇఇ రాజ్‌కుమార్ సింగ్, ఏఇ కుర్షిద్ అన్వర్, మాజీ మున్సి పల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, స్థానిక మాజీ కౌన్సిలర్ సీపతి సుమతి మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట

చెన్నూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగాపూర్ గ్రామంలో విద్యుత్ అధికారులు శనివారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ వినియోగంపై రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల భద్రత, వ్యవసాయ పంపుసెట్ల వినియోగం, ఆటోమెటిక్ స్టార్టర్ల వాడకంతో కలిగే నష్టాల గురించి వివరించారు. అదే విధంగా కెపాసిటర్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.





హెల్ప్ డెస్క్ ఏర్పాటు

జైపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ సందేహాల నివృత్తి కోసం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఎల్ఎల్ఆర్ దరఖాస్తులకు ఏమైనా సందేహాలుంటే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హెల్ప్‌డెస్క్ 9573877758లో సంప్రదించలాన్నారు. ఎంపీపీవో శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏపీవోకు ఉత్తమ మహిళ అవార్డు

చెన్నూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండల ఈజీఎస్ ఏపీవోగా పనిచేస్తున్న గంగా భవాని నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ఉత్తమ మహిళ అవార్డును అందుకున్నారు. ఉపాధి హామీ పథకంలో మహిళలకు ఎక్కువగా పనదినాలు కల్పించినందుకు, మహిళలకు ఉపాధి పనుల్లో ప్రోత్సహిస్తున్నందుకు గాను గంగాభవానికి అవార్డును అందజేశారు.





క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

కోటపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సహకారంతో ఆ పార్టీ యువ నాయకులు క్రీడా దుస్తులు అందించారు. పీఎస్‌కే యువసేన, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులైన కోమట్ల శ్రీకాంత్, గుగులోత్ సమ్మయ్యనాయక్, సల్పాల విష్ణువర్దన్‌లు క్రీడాకారులకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

గని కార్మికుడి మృతి

కాసిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట 1వ గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంటెంకి సత్తయ్య (48) అనారోగ్యంతో శనివారం ఉదయం ఇంట్లోనే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. సత్తయ్య కొంత కాలంగా అనారోగ్యం బారిన పడ్డాడు. ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించగా కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. సత్తయ్య మృతికి కార్మికులు, నాయకులు సంతాపం తెలిపారు.

మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం

భీమిని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలపై జరుగతున్న దా డులకు, పరువు హత్యలకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రమాదేవి అన్నారు. శనివారం మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, చింతపురి బాపురావు, లక్ష్మయ్య, పార్వతక్క, పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం

జైపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకుమట్ల గ్రామపంచాయతీ కార్యదర్శి ఆర్. శ్రావణిని కలెక్టర్ శనివారం ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. గ్రామపంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంతో పాటు విదుల్లో ప్రతిభ కనబర్చడంతో ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా శ్రావణి ఎంపికైందని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పేర్కొన్నారు.

ఊరూరా మహిళా దినోత్సవం



చెన్నూర్‌లో..

బెల్లంపల్లి/చెన్నూర్/మందమర్రి/రూరల్/జన్నారం/కాసిపేట/జైపూర్/కోటపల్లి/రామకృష్ణాపూర్/వేమనపల్లి/లక్షెట్టిపేట/దండేపల్లి/గర్మిళ్ల/మంచిర్యాల క్రైం/తాండూర్/భీమిని/శ్రీరాంపూర్ : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు చేసిన సేవలను కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, పురుషులతో సమానంగా ముందుకు పోవాలని వారు ఆకాంక్షించారు. మరి కొన్ని ప్రాంతాల్లో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు పాల్గొన్నారు.



మందమర్రిలో పొదుపు సంఘాల మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌ఎం, అసిస్టెంట్ మేనేజర్



లక్షెట్టిపేటలో..



కాసిపేట గనిపై మహిళా కార్మికులను సన్మానిస్తున్న అధికారులు, కార్మిక సంఘాల నాయకులు



తాండూర్‌లో మహిళా సిబ్బందికి సన్మానం..



దండేపల్లిలో..



శ్రీరాంపూర్‌లో..



కోటపల్లిలో కేక్ కట్ చేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు..



యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు యుద్ధప్రతిపాదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని ఎస్‌ఈ రాథోడ్ శేషారావు అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 13,833 వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 2024 నుంచి, 2025 ఫిబ్రవరి వరకు 1,029 రిలీజ్ చేశామని తెలిపారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే సుమారు 3.5 శాతం పెరిగిందని తెలిపారు.

ఉద్యాన శాఖలో సిబ్బంది కొరత



ఉద్యాన శాఖలో సిబ్బంది కొరతతో జిల్లా రైతులు ప్రోత్సాహం అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల విస్తీర్ణం పెంచాలని సూచిస్తున్నా సిబ్బంది లేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

- ఉన్నవారిపై పెరుగుతున్న పని ఒత్తిడి
- ఏళ్ల తరబడి నియామకానికి నోచుకోని వైనం
- రైతులకు సూచనలు, సలహాలు కరువు

బెజ్జూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలో ఉద్యోగ సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏళ్ల తరబడి ఈ సమస్య తీరడం లేదు. ఈ రెండు శాఖల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో జిల్లాలోని ఉద్యానవన, పట్టుపరిశ్రమ సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతూ వస్తోంది. పెరుగుతున్న జనాభాకు సరిపడా కూరగాయల ఉత్పత్తి జరగడం లేదు. శివారు ప్రాంతంలో వ్యవసాయం చాలా వరకు తగ్గిపోయింది. వ్యవసాయ భూములు వెంచర్లుగా మారిపోయాయి. ఎక్కడ చూసినా లేఅవుట్లు, వెంచర్లే దర్శనమిస్తున్నాయి. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహం లేకపోవడంతో చాలా వరకు భూములు అమ్ముకొని వ్యవసాయం చేయడమే మానేశారు. సాగు విస్తీర్ణం పెంచేందుకు అవసరమైన చర్యలు ఉద్యానశాఖ తీసుకోవడం లేదు. ఉద్యాన రైతులకు సబ్సిడీపై విత్తనాలు, యంత్రాలు అందడం లేదు. పాలీహౌజ్ రైతులను పట్టించుకోవడం లేదు. డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు ఏళ్లతరబడి ఎదురు చూస్తున్నారు. సాగు విస్తీర్ణం పెరగాలంటే రైతులకు సలహాలు, సూచనలు అందించాల్సి ఉంటుంది. కానీ ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖలో అధికారుల నియామకం చేపట్టక ఆ దిశగా చర్యలు తీసుకునేవారు లేరు.

ప్రోత్సాహం కరువు..

రైతులకు సబ్సిడీపై కూరగాయ విత్తనాలు అందించడం, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేయించడం, మామిడి, అరటి, బొప్పాయి, నారింజ, జామ, దానిమ్మ తదితర పండ్ల తోటలను పెంచేందుకు ప్రోత్సహించాల్సి ఉంది. సాగులో మెళకువలను రైతులకు ఉద్యానశాఖ అధికారులు తెలియజేయాల్సి ఉంది. కొంతమంది రైతులు ఉద్యాన, పట్టుపరిశ్రమను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నపట్టికీ వారికి ప్రోత్సాహం కరువైంది. జిల్లాలో రెండు డివిజన్ల పరిధిలో 15మండలాలు ఉన్నాయి. మండలానికో హార్టికల్చర్, పట్టుపరిశ్రమ అధికారి ఉండాలి కానీ ఈ రెండు శాఖలను చూసుకునేందుకు క్షేత్రస్థాయిలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో వారు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించడం రైతులకు సలహాలు ఇవ్వడం కష్టంగా మారింది. ఎన్నో ఏళ్లుగా రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నామమాత్రంగానే సలహాలు అందుతున్నాయి. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక రైతులకు సరైన ప్రోత్సాహం అందడం లేదు. కాగా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖను వ్యవసాయ శాఖలో విలీనం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కూరగాయ పంటలు, పట్టుపరిశ్రమను పెట్టుకుంటే సూచనలిచ్చే వారు లేరని రైతులు వాపోతు న్నారు. జిల్లాలో పండ్ల తోటలు 1,532, ఆయిల్‌పామ్ 1,254 ఎకరాల్లో సాగవుతున్నాయి. కూరగాయలు వానాకాలంలో 4,021, యాసంగిలో 4,621 ఎకరాలు, ఆగ్రో ఫారెస్ట్రీ570ఎకరాలు, పట్టుపరిశ్రమ 12ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు.

భర్తీకి నోచుకోని పోస్టులు..

జిల్లాలోని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలో గత కొన్నేళ్లుగా పోస్టులు భర్తీ కావడం లేదు. జిల్లా ఉద్యాన శాఖలో ముగ్గురు హార్టికల్చర్ అధికారులు ఉండాల్సి ఉండగా ఒక్క పోస్టు ఖాళీగా ఉంది. ఒక్క అసిస్టెంట్ డైరెక్టర్ కూడా లేరు. పట్టుపరిశ్రమ శాఖలో ఇద్దరు సెరికల్చర్ అధికారులు ఉండాల్సి ఉన్నా ఒక్కరు మాత్రమే ఉన్నారు. మరో అధికారి మంచిర్యాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. టెక్నికల్ ఆఫీసర్లు ముగ్గురు ఉండాలి కానీ ఒక్కరు కూడా లేరు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఏడుగురు ఉండాలి, ఇద్దరు మాత్రమే ఉన్నారు. వ్యవసాయ శాఖ మాదిరిగానే మండలానికి ఒక ఉద్యానశాఖ అధికారితో పాటు ఇద్దరు, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేయాల్సిన అవసరముంది. ఉన్న పోస్టులను భర్తీ చేయక, కొత్తవి ఏర్పాటు చేయక ఉద్యానశాఖ ఖాళీగా ఉంది. గతం కంటే ఇప్పుడు ఉద్యానశాఖ సేవలు రైతులకు ఎక్కువగా అవసరమున్నాయి. రైతులు ఆహార ధాన్యాలతో పాటు ఉద్యానశాఖ పరిధిలోకి వచ్చే పంటలను సాగు చేసే ఆలోచనలో ఉన్నారు. సబ్సిడీ పరికరాలు కూడా ఉద్యానశాఖ పరిధిలోనే ఉండడంతో ఉద్యోగుల సేవలు ఎక్కువ అవసరముంది. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు..

- అబ్దుల్ నదీం, జిల్లా ఉద్యాన శాఖ అధికారి



సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఉన్నది వాస్తవమే. పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదికను అందజేశాం. ఉన్న వారితో రైతులకు ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు మాకు పోన్ చేసినా సూచనలు చేస్తాం.

మహిళా సంఘాల అభివృద్ధికి చేయూత



బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభి వృద్ధి కోసం ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సంఘాల అభివృద్ధి దిశగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం మహిళా సంఘాల అద్దె బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి బయలు దేరుతున్న రెండు బస్సులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ మహిళా సమాఖ్యకు ఒక బస్సు చొప్పున కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా హైదారాబాద్‌లో ఏర్పాటు చేసి కార్యక్రమానికి జిల్లా నుంచి మహిళా సంఘాల నాయకులు వెయ్యి మంది రెండు బస్సులలో వెళ్తున్నారని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కుమరం భీం పురస్కారానికి ఎంపిక

ఆసిఫాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భారత్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వ హించే 2024 కుమరం భీం జాతీయ పురస్కారానికి సినీనటుడు సాయికుమార్‌ను ఎంపిక చేసినట్లు ఎంపిక కమిటీ చైర్మన్, ఐఏఎస్ అధికారి పార్థసారధి, కో చైర్మన్, నిర్మాత డి సురేష్‌కుమార్, కన్వీనర్లు కుమరం సోనేరావు, సిడాం అర్జు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ కల్చరల్ అకాడమీ అధ్వర్యంలో 12 ఏళ్లుగా ఆదివాసీ సాంస్కృతిక పరిషత్ సంయుక్తంగా ఈ అవార్డులను అందిస్తున్నదని పేర్కొన్నారు. ఈనెల 23న జిల్లా కేంద్రంలో అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.

వనదేవతల గద్దెలు పరిశీలన

చింతలమానేపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలో గల వన దేవత గద్దెలకు గుర్తు తెలియని దుండగులు ఇటీవల నిప్పటించడంతో శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు మల్లయ్య, రామన్న, రంగన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కౌటాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైమరీ స్కూల్‌లో శనివారం విద్యా ర్థులకు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ జానకీరాం ఆధ్వర్యంలో ఎంఈవో చేతుల మీదుగా విద్యార్థులకు గ్లాస్‌లు, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ముస్లింలకు ఇఫ్తార్ విందు

లింగాపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాపటార్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివరామ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్‌చాంద్, శంశోద్దీన్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం విద్యుత్ మోటారు చోరీ

దహెగాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం చిన్న అయినం గ్రామానికి చెందిన రక్షిత మంచినీటి పథకంకు సంబంధించి బావికి ఏర్పాటు చేసిన ఐదు హెచ్‌పీ విద్యుత్ మోటారును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఇనోష్ ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెంచికలపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త తిరుపతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేజీబీవీలో పని చేసిన ఏఎన్ఎం నవలోక, కుక్ స్వప్నకు రెండేళ్లుగా వేతనం రావడం లేదని చెప్పారు. వీరితో పాటు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు నిర్మల, మల్లక్కకు ఎనిమిది నెలలుగా, స్థానిక పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న జయ, సుగుణకు రెండేళ్లుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షకు పలువురు స్థానిక నాయకులు మద్దతు తెలిపారు.

భీమన్న ఆలయం ముస్తాబు

రెబ్బెన, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలేటిలోని భీమన్న ఆలయం భీమన్న జాతరకు ముస్తాబైంది. ఆదివారం నుంచి నిర్వహించనున్న జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొలాం మన్నెవార్ సంరక్షణలో భీమన్న దేవుడికి పూజలను అందుకుంటున్నారు. గుండాల వాగులోని నీటి గుండాలలో స్నానాలు చేసి ఇక్కడ పూజలు నిర్వహించే వారు. ఈ ఆలయంలో పూర్తి స్థాయిలో వసతులు లేక పోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు,వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

మున్నూరు కాపు సంఘం మండల కార్యవర్గం

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండల మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని శనివారం జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణపతి, గౌరవ అధ్యక్షులుగా శంకర్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా శంకర్, గోపాల్ ఎన్నికయ్యారు. ప్రదాన కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా శంకర్, ప్రచార కార్యదర్శిగా నారాయణ, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఆసిఫాబాద్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి దంపతులను సన్మానిస్తున్న కోర్టు సిబ్బంది



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురష్కరించుకొని జిల్లా కేంద్రంలో పలు చోట్ల కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కోర్టు అవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు యువరాజ, అనంతలక్ష్మి జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్ దంపతులను సన్మానించారు. ఆదివాసి భవన్‌లో నిర్వహించిన వేడుకలకు మాజీ సర్పంచ్ సరస్వతి, జీసీడీవో శకుంతల హాజరై కేక్ కట్ చేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు ఆధ్వర్యంలో, యూత్ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక రామకృష్ణ వివేకనంద సెంటర్‌లో జాగృతి మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, డాక్టర్‌సునీత, డాక్టర్ అశ్విని, మహేష్ సర్కార్, భజరంగ్ సోని, ప్రశాంత్ సర్కార్, సంతోష్ ఠాకూర్, సుమితా గుప్తా, కౌశిక్ భట్టాచార్య, నీతుసర్కార్, గీతాఝువర్ తదితరులు పాల్గొన్నారు. బురదగూడలో ఎస్పీఎం స్పర్శఫౌండేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీనాబిల్వాల్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్పర్శ ఫౌండేషన్ ప్రతినిధులు సుశీల, శివ, మాజీ సర్పంచి చాటరే స్వాతి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు. కాగజ్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బందిని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్ పాల్గొన్నారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో స్థానిక రిటైర్డ్ ఉద్యోగ సంఘ భవన్‌లో డాక్టర్ కొత్తపల్లి అనితను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, మండల అధ్యక్షులు బిక్షపతి, మండల కార్యదర్శి దేవాజీ, అర్బన్‌అధ్యక్షులు రతన్ గేయిన్, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోపీవీఆర్ కన్‌స్ట్రక్షన్ సివిల్ ఇంజనీర్ దుర్గం ప్రశాంత్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో జావీద్, సామాజిక కార్యకర్త ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్యజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎస్సై చంద్రశేఖర్ మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడకులు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు అన్నపూర్ణ అరుణ, రెబ్బెన మాజీ సర్పంచ్ అహల్యదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుందారపు శంకరమ్మ, పీవీ వరక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సింగరేణి మహిళా ఉద్యోగులను సన్మానించారు.

లింగాపూర్, (ఆంధ్యజ్యోతి): మండలంలో మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐకేపీ ఏపీఎం తిరుపతి, కార్యదర్శి అంబాజీ, సీసీలు, వీవీ సంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మహిళా ఉపాధ్యాయులను సన్మా నించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రకాష్, రవీందర్, శివప్రసాద్, మౌనిక, ఉపాధ్యా యులు భాస్కర్, అజయ్, రంగయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అన్నారు. రాణి దుర్గావతి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు రాణి దుర్గావతి ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ యాదవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో, పోలీసుస్టేషన్‌లో మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లు సుమ, సుధ, మాధురి, సుచరిత సన్మానించారు. ఎస్సై కమలాకర్, ఏఎస్సై రాములు, కానిస్టేబుళ్లు శరత్, సురేష్, రాజకుమార్ ఈవో తిరుపతి పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివాసీలు, వాసవి మాత ఆలయంలో ఆర్యవైశ్యులు, ఇంపాక్ట్ క్లబ్ ధ్వర్యంలో అంగన్‌వాడీలు, వివిధ పాఠ శాలల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు అమ్మక్క, సరిత, భాగ్య, శోభ, కాశక్క, శశికళలతో పాటు మహిళా ఉపాధ్యాయులు శిల్ప, సుమిత, స్వప్నను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): కౌటాల సీఐ కార్యాలయంలో సీఐ రమేశ్ ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు. తలోడి ప్రాథమిక పాఠశాలలో మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు కమలాకర్, మధుకర్, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెనలో మహిళా కానిస్టేబుళ్లకు సన్మానం చేసిన ఎస్సై



కాగజ్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న మహిళలు



వాంకిడిలో మహిళలను సన్మానిస్తున్న నిర్వాహకులు



సిర్పూర్‌లో మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్సై

పనిచేయని సీసీ కెమెరాలు



నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

బెజ్జూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నేటి పరిస్థితుల్లో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా మారిన సీసీ కెమెరాలు నిర్వహణ లోపంతో పని చేయడం లేదు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం ఎక్కడా పని చేయడం లేదు. ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగతనాలను అరికట్టవచ్చని పోలీసులు చెబుతుంటారు. కానీ సీసీ కెమెరాల నిర్వహణ నను పట్టించుకోకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు కొన్ని రోజులుగా పని చేయడం లేదు. దీంతో దొంగతనాలు, ద్విచక్రవాహనాలు, ఇళ్లల్లో చోరీలు, ఇతర నేరాలను పరిష్కరించేందుకు పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. నేరం జరిగిన ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల్లో నమోదైన చిత్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. గతంలో మండల కేంద్రాల్లోని పలు షాపుల్లో, ఇళ్లల్లో చోరీలు జరిగిన సమయంలో కేసులను పోలీసులు ఛేదించలేకపోయారు. ఇప్పటికైనా సీసీ కె మెరాలు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రెండేళ్ల పాటు చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉపాధ్యాయులకు రెండు సంవత్సరాల పాటు చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. అంతర్జాతీయ మ హిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ గురుకుల కళాశాలో ప్రమాదంలో మహిళల హక్కులు- మన కర్తవ్యం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుజాత, అధ్యాపకురాలు తిరుమల, సంఘం నాయకులు సబిత, సమత కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి

రెబ్బెన, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళకు భద్రత కల్పించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి డిమాండ్ చేశారు. గోలేటిలోని సివిల్ కార్యాలయం వద్ద శనివారం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల దాటినా సమాజంలో మహిళలపై వివక్ష కొనసాగుతోందన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అరుణ, జిల్లా నాయకులు లక్ష్మి పాల్గొన్నారు.